చర్లపల్లి పారిశ్రామికవాడ దేశానికి రోల్ మోడల్ కావాలి

టీఎస్ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న టీఎస్ఐఐసీ ఎండీ డాక్టర్ ఈ.విష్ణువర్ధన్‌రెడ్డి

కుషాయిగూడ: దేశానికే చర్లపల్లి పారిశ్రామికవాడ రోల్ మోడల్ కావాలని టీఎస్ఐఐసీ ఎండీ డాక్టర్ ఈ.విష్ణువర్ధన్‌రెడ్డి ఆకాంక్షించారు. సమష్టి కృషితోనే అది సాధ్యమవుతుందని, అందుకు కావాల్సిన పూర్తి సహకారం టీఎస్ఐఐసీ అందజేస్తుందని ఆయన స్పష్టం చేశారు. చర్లపల్లి పారిశ్రామికవాడలో ప్రొఫెసర్ జయశంకర్ పార్కును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నగరం, మారుతున్న జనరేషన్‌కు అనుగుణంగా పారిశ్రామిక ప్రగతిలో మార్పులు రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రభుత్వం ఎక్స్‌పోర్ట్ పాలసీని వృద్ధి చేయాలనే యోచనలో ఉందన్నారు. ఇప్పటికే పలు పారిశ్రామికవాడల నుంచి ఉత్పత్తులు ఎక్స్‌పోర్ట్ అవుతున్నాయని, దాన్ని మరింత వృద్ధి చేసి రాష్ట్రానికి ఎక్స్‌పోర్ట్ చాంపియన్స్‌గా గుర్తింపు తేవడంలో చర్లపల్లి పారిశ్రామికవాడ భాగస్వామ్యం కావాలన్నారు. అలాగే చర్లపల్లిలో త్వరలోనే రైల్వే టెర్మినల్ ప్రారంభంకానున్న నేపథ్యంలో రైల్వే అవసరాలకు తగ్గట్టు వ్యాపార మార్గాలు అన్వేషించుకోవాలన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పారిశ్రామికవాడలను అభివృద్ధి చేసేందుకు ఓ పాలసీ తీసుకువచ్చిందన్నారు. దానికి టీఎస్ఐఐసీ చర్లపల్లి పారిశ్రామికవాడను ప్రతిపాదించామన్నారు. ఇది అమలు జరిగితే ఐలా ప్రతిపాదన మేరకు పారిశ్రామికవాడలో మౌలిక వసతుల కల్పనతో పాటు పెద్ద ఎత్తున అభివృద్ధి చేపట్టి దేశానికే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దే అవకాశం ఉంటుందన్నారు. జయశంకర్ పార్కు పారిశ్రామికవాడలకు రోల్ మోడల్‌గా ఉందని అభినందించారు. ఎఫ్‌టీసీసీ జాతీయ అవార్డులకు ఈ పార్కును నామినేట్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దేశంలోనే ద బెస్ట్ పార్కుగా తీర్చిదిద్దేందుకు పూర్తి సహకారం అందజేస్తామన్నారు. అవకాశమున్న ప్రతి పారిశ్రామికవాడలో ఇలాంటి పార్కులు నెలకొల్పాలన్నారు. పారిశ్రామివేత్తలకు రావాల్సిన ఇన్సెంటివ్స్, సబ్సిడీల అంశం ప్రభుత్వ పరిధిలోకి వస్తుందని, కొత్త ప్రభుత్వం కాబట్టి కొంత సమయం వేచి ఉండాలన్నారు. కార్యక్రమంలో టిఫ్ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, ఐలా చైర్మన్ జెక్క రోషిరెడ్డి, సిఐఏ అధ్యక్షుడు గోవిందారెడ్డి, ఐలా సెక్రటరీ చంద్రశేఖర్, జోనల్ మేనేజర్ మాధవి, టీఎస్ఐఐసీ సీఈఓ మధుసూదన్, చీఫ్ ఇంజనీర్ శ్యాంసుందర్, డిప్యూటీ జోనల్ మేనేజర్లు ఉమా మహేశ్వర్, శిల్ప, జ్యోతి, చర్లపల్లి ఐలా కమీషనర్ తుల్చానాయక్ తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులకు వరం

- పీఎం విశ్వకర్మ పథకంతో పెరగ నున్న ఉపాధి అవకాశాలు
- మార్గదర్శకాలు జారీ చేసిన కేంద్రం
- పథకం అమలుకు జిల్లా పరిశ్రమల శాఖ కసరత్తు




సాక్షి, మేడ్చల్ జిల్లా: ఒకప్పుడు చేతి వృత్తిదారులకు గ్రామాల్లోనే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండేవి. మారుతున్న కాలానికి అనుగుణంగా హస్త కళాకారులు నూతన ఒరవడి అందిపుచ్చుకోవడంలో కొంత వెనుకపడుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు పలు రకాల యంత్ర పరికరాలు (టూల్ కిట్లు) పంపిణీ చేయడం, తక్కువ వడ్డీకి రుణాలు అందించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా 2023 సెప్టెంబరు 17న ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా అర్హులైన హస్త కళాకారుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించి వారికి శిక్షణ అందించనున్నారు.



మూడు విభాగాలుగా...

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో భాగంగా ఎంపికైన వారికి వారం పాటు నిపుణులతో పలు హస్త కళారూపాలు తయారీపై శిక్షణను మూడు విభాగాలుగా అందిస్తారు. మొదటిది చేతి వృత్తి కళాకారుల నైపుణ్యాలను అంచనా వేయడం, రెండోది ప్రాథమిక శిక్షణ ద్వారా నైపుణ్యాలు మెరుగుపడేలా చూస్తారు. మూడోది అధునాతన శిక్షణ ద్వారా మరింత నైపుణ్యం పెంచుకునేందుకు 15 రోజుల వరకు అధునాతన శిక్షణ అందిస్తారు. కార్యక్రమానికి హాజరైన చేతి వృత్తి కళాకారులకు రోజుకు రూ.500 చొప్పున అందించనున్నారు. ప్రాథమిక శిక్షణ పూర్తయ్యాక లబ్ధిదారులకు అవసరమైన యంత్ర పరికరాలు(టూల్ కిట్లు)ల కొనుగోలుకు రూ.15 వేలు చెల్లించనున్నారు. అనంతరం బ్యాంకుల ద్వారా 5 శాతం వడ్డీతో రూ.లక్ష రుణం మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటారు. మొదటి విడత రుణాన్ని లబ్ధిదారులు 18 నెలల కాలంలో చెల్లిస్తే.. రెండో విడతలో రూ.2 లక్షల వరకు రుణం పొందవచ్చు. ఈ రుణం 30 నెలల కాలంలో చెల్లించాల్సి ఉంటుంది.

ఎవరికి వర్తిస్తుందంటే..

స్వయం ఉపాధి ప్రాతిపదికన సంప్రదాయ చేతి వృత్తిదారులు, హస్త కళాకారులు ఈ పథకం ద్వారా లబ్ధిపొందడానికి అర్హులు.. వడ్రంగి, పడవలు, ఆయుధాలు తయారు చేసేవారు, కమ్మరి, సుత్తులు, టూల్ కిట్లు తయారు చేసేవారు. శిల్పులు, స్వర్ణకారులు, కుమ్మరి, చెప్పులు కుట్టేవారు, తాపీ మేస్త్రీలు, బుట్ట, చాపలు, చీపుర్లు అల్లేవారు. బొమ్మల తయారీ, నాయీ బ్రాహ్మణులు, పూలదండలు తయారు చేసేవారు, చాకలి, దర్జీలు, చేపల వలలు తయారు చేసేవారు. తాళంచెవి తయారీదారులకు పథకాన్ని వర్తింపజేయనున్నారు.




అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం..



ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా 18 ఏళ్లు నిండిన హస్త కళాకారులకు అవసరమైన శిక్షణ అందించి రుణ సదుపాయం కల్పించడమే ఈ పథకం ఉద్దేశం. పలు శాఖల సమన్వయంతో ఇటీవల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాం. పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

– పి.రవీందర్, జాయింట్ డైరెక్టర్, జిల్లా పరిశ్రమల శాఖ

దరఖాస్తు విధానం..

అర్హులైన వారు వివరాలను వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. లబ్ధిదారుల వయసు 18 ఏళ్లు నిండి ఉండాలి. ఐదేళ్ల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి రుణాలు పొందకూడదు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యులు అనర్హులు. లబ్ధిదారులు సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ) కేంద్రాల ద్వారా ఎలాంటి రుసుం లేకుండా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు ఆధార్, ఫోన్ నంబర్, బ్యాంకు వివరాలు, రేషన్ కార్డును సమర్పించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న తర్వాత అర్హుల ఎంపిక బాధ్యతను గ్రామ పంచాయతీ కార్యదర్శులు చూడనున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులను సంబంధిత కార్యదర్శులకు పంపిస్తారు. వాటి ఆధారంగా క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులు చేతి వృత్తులను చేస్తున్నారా..? లేదా అనే వివరాలను పరిశీలించి ఎంపిక చేస్తారు.

8న క్రికెట్ టోర్నీ

మల్లాపూర్: మల్లాపూర్ శాంతి యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో శివరాత్రి పర్వదిన సందర్భంగా ఈనెల 8వ తేదిన శుక్రవారం రాత్రి చాందినీ క్రికెట్ టోర్నీని శాంతి యూత్ క్లబ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎస్వీ శశి, శ్రీనివాస్, సంపత్, మెఘరాజ్‌లు తెలిపారు. ఈ టోర్నీలో పాల్గొనే టీమ్‌లు ముందస్తుంగా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఈ క్రికెట్ టోర్నీలో విన్నర్ టీమ్‌కి 15 వేలు, రన్నర్‌గా నిలిచిన వారికి రూ వివరాల కోరకు 7989929259, 9110574920,7995126012 నెంబర్‌లకు సంప్రదించవచ్చు.

సమస్యలు పరిష్కరించండి



అల్వాల్: మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డిని బుధవారం వినాయక్‌నగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు మోమిన్‌భాష ఆధ్వర్యంలో కలిశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్బంగా మంత్రిని కోరారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ గౌడ్, ఆశ, కీర్తి గణేష్, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని సాయినాథపురంలోని ఎస్ఆర్‌డీజీ పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులు సైన్స్, మ్యాథ్స్, కంప్యూటర్, సైబర్ నేరాలు, అడవులు, పర్యావరణ, రోబో టెక్నాలజీ వంటి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి, అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ సరోజా మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి వైజ్ఞానిక ప్రదర్శలు ఎంతగానో దోహదపడుతాయని తెలిపారు.

చిన్నతరహా సూక్ష్మ పరిశ్రమలకు తోడ్పాటునందిస్తాం


ఎంఎస్ఎంఈ ఎక్స్ పోను సందర్శించిన టీఎస్ఐఐసీ ఎండీ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

కుషాయిగూడ: చిన్నతరహా సూక్ష్మ పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ)ల మనుగడకు కావాల్సిన సంపూర్ణ తోడ్పాటునందిస్తామని టీఎస్ఐఐసీ ఎండీ డాక్టర్ ఈ. విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. చర్లపల్లి ఇండస్ట్రీయల్ అసోసియేషన్‌లో మూడు రోజుల పాటుగా జరిగిన ఎంఎస్ఎంఈ ఎక్స్ పో-2024 బుధవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ఆయన హజరై ఎక్స్ పోలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. ఎంఎస్ఎంఈలు చేస్తున్న ఉత్పత్తుల పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. నూతన సాంకేతికతను అందిపుచ్చుకుంటు ప్రగతి వైపుగా అడుగులు వేయాలన్నారు. ఎంఎస్ఎంఈ యూనిట్ల ఉత్పత్తులకు అవసరమైన మార్కెటింగ్ సదుపాయాలను మరింత మెరుగు పరుస్తామన్నారు. ఇలాంటి పారిశ్రామిక ప్రదర్శనలతో మార్కెంటింగ్ మార్గం సుగుమం అవుతుందన్నారు. ఎక్స్ పోను నిర్వహించిన సిఐఏ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో టిఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, సిఐఏ అధ్యక్షుడు గోవిందారెడ్డి, ఐలా చైర్మన్ జెక్క రోషిరెడ్డి, టీఎస్ఐఐసీ కమీషనర్ మాధవి, ఐలా కమీషనర్ తుల్చా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్ టాప్ పథకం ప్రారంభం

సికింద్రాబాద్ ఈస్ట్ సబ్ డివిజన్ సైనిక్‌పురి బ్రాంచ్ వెంకన్న



అల్వాల్: దేశవ్యాప్తంగా రూఫ్ టాప్ సోలార్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్ సికింద్రాబాద్‌ఈస్ట్ సబ్ డివిజన్ సైనిక్‌పురి బ్రాంచ్ వెంకన్న అన్నారు. ఇళ్ల పైకప్పులపై సోలార్ ప్లాంట్లను అమర్చనున్నట్లు తెలిపారు. సబ్ డివిజన్‌పరిధిలోని గల అన్ని పోస్ట్ ఆఫీస్‌లలో 300 యూనిట్లు ఉచిత విద్యుత్‌ని కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి సూర్యఘర్ మస్త్ బిజిలి యువజన పథకం రిజిస్ట్రేషన్లు ప్రారంభించారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇండ్లకు సబ్సిడీతో రూఫ్ టాప్ ప్లాంట్లను నిర్మించి ఇచ్చి నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే ఈ పథకాన్ని పోస్ట్ ఆఫీస్ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్లు ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పథకానికి రూ. 1.80 లక్షలు కాగా ఇందులో రూ. 78 వేలు సబ్సిడి ఉంటుందని తెలిపారు.

ఎందుకు ఇంత నిర్లక్ష్యం...

రోడ్డును అడ్డంగా తవ్వి వదిలేయడంతో అవస్థలు

ఉప్పల్: జల మండలి అధికారుల నిర్లక్షం వల్ల ఉప్పల్ సౌత్ స్వరూప్‌నగర్ రోడ్డులో ప్రతి నిత్యం ట్రాఫిక్ జామ్ అవ్వడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మంచి నీటి పైపులైన్ కోసం దాదాపుగా రెండు నెలల క్రితం సౌత్ స్వరూప్‌నగర్ కమాన్ వద్ద, కేకే గార్డెన్ వద్ద వీటి కమాన్ రోడ్డును తవ్వి వదిలేయడం వల్ల రోడ్డు మూల మలుపు వద్ద గోయి ఏర్పడటంతో నిత్యం ట్రాఫిక్ జాం అవుతోంది. ప్రతి నిత్యం ఉదయం సాయంత్రం వేళల్లో గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. స్థానికులు ఎన్నో మార్లు అధికారులు ఫిర్యాదులు చేస్తూన్నా పెడచెవిన పెడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే రెండు సార్లు ప్రజావాణిలో సైతం ఫిర్యాదులు చేస్తున్నా స్థానిక జీహెచ్ఎంసి కాని, జల మండలి అధికారులు కాని పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.రూ. కోట్లు ఖర్చు పెట్టి వేసిన రోడ్డును జలమండలి అధికారులు ఎలాంటి సమాచారం లేకుండా ఇష్టానుసారంగా రోడ్డును తవ్వడం వల్లనే ఈ సమస్య ఉత్పన్నమయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రోడ్డు మూల మలుపుపై పెద్ద గొయి ఏర్పడంతో వచ్చిన వాహనాలు అందులో నుంచి నడపలేక ఇబ్బందులు పడుతున్నారని స్కూల్స్ సమయాల్లో అది కూడా పరీక్షలకు వెల్లే సమయంలో విద్యార్థులు ట్రాఫిక్‌లో ఇరుక్కుని ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డుకు మర్మత్తులు చేయాలని కోరుతున్నారు.


ఉప్పల్ విటి కమన్ రోడ్డు సౌత్ స్వరూప్‌నగర్ వద్ద తవ్వి వదిలేసిన రోడ్డు


నిత్యం ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు పడుతున్న జనం

నీటి ఎద్దడిని నివారించాలి


జలమండలి అధికారులకు వినతిపత్రం అందచేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

గౌతంనగర్: రానున్న వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడిని నివారించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి జలమండలి అధికారులకు సూచించారు. గౌతంనగర్ డివిజన్ ఎత్తైన ప్రదేశాలు ఐఎస్‌నగర్, జేఎఎంఎస్‌నగర్, హిల్‌టాప్ కాలనీ, వెంకటేశ్వరనగర్, అన్నపూర్ణ సొసైటీ, మల్లిఖార్జుననగర్, గోపాల్‌నగర్, గౌతంనగర్‌లకు త్రాగునీటి సౌకర్యం కల్పించాలని, నీటి ఎద్దడిని నివారించాలని కోరుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి బుధవారం జలమండలి జీఎం వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు రావుల అంజయ్య, మురుగేష్, రాము యాదవ్, రమేష్, పరమేష్, అరుణ్, నర్సింగ్‌రావు కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం


యూజీడీ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కార్పొరేటర్

రామంతాపూర్ : డివిజన్ పరిధిలోని గోకుల్ నగర్ బందావన్ గార్డెన్ నుంచి శారదానగర్ మెయిన్ రోడ్డు వరకు ఎన్నో ఏళ్ళుగా పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రైనేజీ సమస్యను రూ.15 లక్షల నిధులతో నిర్మాణ పనులను బుధవారం ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా బస్తీల్లో కాలనీలో మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తానని అదే విధంగా అభివద్ధి ఏజెండాగా సమస్యాత్మక బస్తీల్లో కాలనీలో అభివద్ధి పనులు చేపట్టి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్పొరేటర్ శ్రీవాణి మాట్లాడుతూ తాను కార్పొరేటర్‌గా ఎన్నికైనప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్న పలు అభివద్ధి పనులను పూర్తి చేస్తామని నిధుల లేమితో ఇంకా చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయడానికి కషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, సూరం శంకర్, మహ్మద్ ముస్తాక్, చాంద్‌పాషా, కాపర్తి మోహన్‌కష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ మంజూరు



మల్కాజిగిరి:మల్కాజిగిరి సత్తిరెడ్డినగర్‌కు చెందిన మౌనికా ప్రియ చికిత్స కోసం ఎల్‌ఓసీకోసం దరఖాస్తు చేసుకున్నది. ప్రభుత్వం నుంచి లక్ష రూపాయలు మంజూరైన ఎల్ఓసీ మంజూరు పత్రాన్ని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆమె కుటుంబసభ్యులకు అందజేశారు.

మల్కాజిగిరి ట్రాఫిక్ ఏసీపీగా శ్రీనివాస రావు



ఉప్పల్: మల్కాజిగిరి ట్రాఫిక్ ఏసిపిగా ఎం వి శ్రీనివాస్‌రావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన శ్రీనివాస్ రావు చీఫ్ ఆఫీస్‌కు బదిలిపై వెల్లారు. ఎం వి శ్రీనివాసరావు ఏసీబీ డిఎస్‌పిగా పని చేసి బదిలిపై మల్కాజిగిరికి వచ్చారు.

మాట తప్పిన ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం



ఉప్పల్: ఎల్ఆర్ఎస్‌పై మాట మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఎల్ఆర్ఎస్ విషయంలో కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ భారత రాష్ట్ర సమితి పిలుపు మేరకు బుధవారం ఉప్పల్ జీహెచ్ఎంసి కార్యాలయ ఆవరణంలో మహా ధర్నాను నిర్వహించారు. కార్యాలయం ఎదుట బైటాయించి ఆందోళన చేసారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చే సారు. అనంతరం ఎమ్మెల్యే అధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులుకు వినతి ప్రతాన్ని అందజే సారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామిని తుంగలో తొక్కిందన్నారు.కేవలం ఎల్ఆర్ఎస్ పేరుతో రూ. 20 వేల కోట్ల వరకు దండుకునేందుకు కుట్ర పన్నిందన్నారు. దాదాపుగా 20 లక్షల కుటుంబాలపై బారం మోపడానికి ప్రభుత్వం సిద్ధమయ్యిందని ఆరోపించారు. ఆరు గ్యారంటీలతో పాటు ఎల్ఆర్ఎస్‌ను ఉచితం చేయాలని డిమాండ్ చేసారు. హామీలను నెర వేర్చేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో రాగిడి లక్ష్మారెడ్డి, జీహెచ్ఎంసి స్టాండింగ్ కమిటి సభ్యులు బన్నాల గీత ప్రవీణ్, మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, మీర్‌పేట్ కార్పొరేటర్ ప్రభుదా పాల్గొన్నారు.

సామాజిక స్ఫూర్తినిచ్చిన నాటిక అరుణోదయం



మల్లాపూర్: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారి సౌజన్యం, రాధ ఆసోసియేషన్ సంయుక్తధ్వార్యంలో 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మల్లాపూర్ నెహ్రూనగర్‌లో అరుణోదయం అనే సందేశాత్మకం నాటికను ప్రదర్శించారు. అరుణోదయం నాటిక సామాజిక స్ఫూర్తినిచ్చింది, ఈ నాటికలో నటీనటుల హావాభావాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ ప్రద ర్శనలో బళ్లారి రాఘవ బిరుదు గ్రహీత మాదుగుల కృష్ణమోహన్,రంగ స్థల సినీ,టీవి నటులు రమేష్‌గౌడ్, నటీమణి ,మనుప్రియ, రామాయణం సత్య నారయణ పాల్గొన్నారు.

చార్‌ధాం యాత్రలో బోడుప్పల్ వాసులు



బోడుప్పల్: దేశంలోని పవిత్రమైన చార్‌ధాం హిందూ భక్తి యాత్రలో ఒకటైన ద్వారకా శ్రీకృష్ణుడి దివ్యక్షేత్రాన్ని బుధవారం బోడుప్పల్ వాసులు దర్శించుకున్నారు. గుజరాత్‌లోని ఈ దివ్య ధామం ఆలయాన్ని అగోరి గురురాజా స్వామి, గుడి స్వర్ణ మధుసూదన్ రెడ్డి దంపతులు, కార్పొరేటర్ పొద్దుటూరు శోభరాణి వెంకటేశ్‌గుప్తా దంపతులు, రామాంజమ్మ, సాయిరెడ్డి దంపతులు, అరుణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శోభారాణి దంపతులు పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

మహిళల సంరక్షణ కోసమే మోదీ పథకాలు


నారీ శక్తి వందన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ సునీతా యాదవ్

మౌలాలి: గత పది సంవత్సరాలుగా కేంద్రంలో నరేంద్ర మోదీ మిశా రిజర్వే షన్ బిల్లు, త్రిపుల్ తలాక్ లాంటి చట్టాలను తీసుకుచ్చిన ఘనత మోదీ దక్కుతుందని మౌలాలి కార్పొరేటర్ సునీతా శేఖర్ యాదవ్ అన్నారు. బుధవారం మౌలాలి కార్పొరేటర్ కార్యాలయంలో నారిశక్తి వందన్ కార్య క్రమాన్ని నిర్వహించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ మహిళా స్వాభిమాన హక్కులు కాపాడడానికి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. మళ్లీ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. మహిళ మద్దతు మోదీకి ఉంటుందన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోమల్కాజ్‌గిరి అసెంబ్లీ కన్వీనర్ డీఎస్ వెంకటేష్, వాసుదేవరావు, డివిజన్ అధ్యక్షులు సాయిబాబు, మోహన్ యాదవ్, మహిళా అధ్యక్షురాలు రాధాబాయి, బబిత, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు ప్రచారం చేస్తుంది


అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో వద్ద ధర్నా


ఉపకమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజలలో అబద్ధాలు ప్రచారం చేస్తోందని మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. స్థలాల క్రమబద్ధీకరణకు(ఎల్ఆర్ఎస్) ఫీజులు వసూళ్ల చేయడాన్ని నిరసిస్తు బుధవారం అల్వాల్ జీహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రావడమే పరమవధిగా భావించిన కాంగ్రెస్ పార్టీ గత ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టిన విమర్శిస్తు ప్రజలను మభ్యపెట్టిందన్నారు. ఇందుకు ఉదహరణ స్థలాల క్రమబద్ధీకరణ (ఎల్.ఆర్.ఎస్) విషయంలో సైతం ప్రభుత్వం పై కాంగ్రెస్ విమర్శలు చేస్తు ప్రజల నుండి ఫీజుల రూపంలో డబ్బులు దోచుకుంటున్నారని విమర్శించారన్నారు. నేడు అధికారంలోకి రాగానే నాటి విమర్శలను మర్చిపోయి ఎల్.ఆర్.ఎస్ రూపంలో ఫీజులు వసుళ్ల చేయ్యడం వారి రెండు నాలుకల దోరణికి నిదర్శనమన్నారు. అభివృద్ధి సంక్షేమల కార్యక్రమాల సైతం మల్కాజిగిరి నియోజకవర్గంలో పక్షపాత దోరణి అవలంబిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు శాంతి శ్రీనివాస్‌రెడ్డి, సబిత అనిల్‌కిషోర్, మురుగేష్, ఎంబీసి మాజీ చైర్మన్ నంది కంటీ శ్రీధర్ పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత.....

ఎల్.ఆర్.ఎస్ క్రమబద్ధీకరణ రుసుము వసూళ్ల చేయ్యడాన్ని నిలిపివేయాలని కోరుతూ జీహెచ్ఎంసి అల్వాల్ సర్కిల్ ఉపకమీషనర్‌కు వినతి పత్రం ఇవ్వడానికి వచ్చిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సర్కిల్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న సమయంలో ఉపకమీషనర్ కార్యాలయం వద్దకు తన వాహనంలో వచ్చారు. కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులందరూ డిసి వాహనాన్ని అడ్డగించారు. కారులో నుండి దిగి వినతి పత్రం తీసుకోవాలని కోరారు. అందుకు ఉపకమీషనర్ శ్రీనివాస్ రెడ్డి నిరాకరించారు. తన కార్యాలయంలోకి వస్తేనే వినతి పత్రం తీసుకుంటానని చెప్పడంతో ఒక్కసారిగి సర్కిల్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. సుమారు ఆర్ధగంటకు పైగా డిసి కారులోనే ఉండడంతో అల్వాల్ సీఐ రాహుల్‌దేవ్ పరిస్థితిని చక్కబెట్టడానికి ప్రయత్నించారు. ఎట్టకేలకు డీసీ వాహనం దిగి ఎమ్మెల్యే నుండి వినతి పత్రం స్వీకరించారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఉపకమీషనర్ వైఖరిని తప్పు పట్టారు. ప్రజా ప్రతినిధులకు కనీస విలువ ఇవ్వకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేశారు.

అధికారులను బెదిరించడం సరికాదు

సర్కిల్ కార్యాలయంలోకి వస్తుండగా వాహనాన్ని అడ్డగించడంతో పాటు ప్రభుత్వ అధికారి పట్ల దురుసుగా ప్రవర్తించడం గౌరవ ప్రదం కాదని ఉపకమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వినతి ప్రతం స్వీకరిస్తున్న సమయంలో సైతం తనపట్ల అనుచిత వాఖ్యలు చేశారన్నారు. ఇది వారి విజ్ఞతకే వదిలేస్తున్నారన్నారు.